# అసలైన ఆభరణం



*వపుషి తవ తనోతి రత్న భూషం*
*ప్రభురిత ధన్యతమాసికింబ్రవీమి*
*సఖి తనునయనాంతరాశభీరుః*
*కలయతి మేన విభూషణానికాంతః*

**భావం:** చెలీ, నీ ప్రభువు నీ దేహానికి రత్నాభరణాలు పెడతాడు. నువ్వు చాలా అదృష్టవంతురాలివి. ఏం చెప్పను. నా శరీరానికీ, తన కళ్ళకూ మధ్య అడ్డంగా వస్తాయని నా ప్రియ భర్త నాకు ఏ నగలూ పెట్టడు.

విజయ, వినయ స్నేహితురాళ్ళు. కలిసిమెలిసి ఉండేవారు. ఎప్పుడూ ఒకేచోట ఒకే ఆటలు ఆడుకునేవారు. ఒకే గురువుదగ్గర చదువుకున్నారు

ఇద్దరూ తమ గురించిన విషయాలు రెండో వారికి చెప్పుకునేవారు. ఒకరికి మంచి జరిగితే రెండోవాళ్ళు సంతోషించేవారు. ఒకరి దగ్గర ఒకరు గొప్పలు కొట్టుకునేవారుకాదు.

ఇద్దరికీ ఒకేసారి వివాహాలయ్యాయి. అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు. ప్రయాణ సౌకర్యాలూ, ప్రచారసాధనాలూ లేని ఆరోజుల్లో ఒకరినొకరు కల్సుకోవడంకానీ, ఒకరి విషయాలు ఒకరికి తెలియపర్చుకోవడం కానీ సాధ్యం కాలేదు.

విజయ భర్త వర్తకుడు. దేశవిదేశాలలో వ్యాపారానికి వెళ్ళి లాభాలార్జించేవాడు. లాభంగా వచ్చిన ధనంతో విజయకు నవరత్నాలతో అనేక నగలు చేయించేవాడు. ఆమె మనస్తత్వం మారిపోయింది.

వినయ భర్త కూడ వర్తకుడే. స్వగ్రామంలో చిన్న కొట్టు ఉండేది. పెద్దగా లాభాలు లేకపోయినా అన్నవస్త్రాలకు లోటు లేదు. భార్యాభర్తలిద్దరికీ సంగీత నాట్యాలు ప్రాణం. అతడు వేణువు ఊదితే ఆమె వీణ వాయిస్తూ పాడేది. అతడు మృదంగం అందుకుంటే ఆమె నృత్యం చేసేది. సంగీత నాట్యాలతో సరససల్లాపాలతో వారికి కాలం హాయిగా గడిచిపోయేది.

అయిదేళ్ళ తరువాత విజయా, వినయా పుట్టిళ్ళకు వచ్చారు. విజయ ముందుగా వచ్చింది. వెనుక వచ్చిన వినయతో అందరూ విజయ అదృష్టవంతురాలనీ, ఆమె భర్త చాలా మంచివాడనీ పొగిడారు. వినయకు విజయను చూడాలని కుతూహలం కలిగింది. స్నేహితురాళ్ళిదరూ గుడిలో కల్సుకుని, కోనేటి గట్టుమీద కూచున్నారు. విజయ తన నగలను చూపించసాగింది.

"ఈ కంఠహారం యవ ద్వీపం నుంచి తెచ్చారు." విజయకు తన భర్త తాను చేసిన నృత్యానికి మెచ్చి తన కంఠం చుట్టూ చేతులవేసి అభినందించడం గుర్తుకు వచ్చింది. " ఈ రవ్వల ముక్కుపుడక కర్ణాట దేశం నుంచి తెచ్చారు. ఇది పెట్టుకుంటే చెంపలు మెరుస్తాయంటారందరూ.

" నీ చెంపల మెరుపు ముందు వెన్నెల వెలుగులెంత" అన్న భర్త మెచ్చుకోలు వినయ తల్చుకుంది. విజయ నగలన్నీ చూపించి "నీ నగలేవి దొంగల భయానికి దాచిపెట్టుకుని వచ్చావా?" అంది.

వినయ "చెలీ నీ ప్రభువు నీ దేహానికి రత్నాభరణాలు పెడతాడు. నువ్వు చాలా అదృష్టవంతురాలివి. ఏం చెప్పను. నా శరీరానికీ తన కళ్ళకూ మధ్య అడ్డం వస్తాయని నా ప్రియుడు నాకు నగలు పెట్టడు." అంది.

విజయకు తన సంసారంలో లోటు తెలిసి వచ్చింది. వినయ వ్యంగ్యంగా తన భర్తను ప్రభువు అంది. అంటే పోషిస్తూ, నగలిస్తున్నాడంతే నన్నమాట. తన భర్త గురించి చెప్పుకుంటూ ప్రియుడు అంది. అంటే ప్రేమించే గుణమున్నవాడన్నమాట. భర్త ప్రేమను మించిన నగలేమంటున్నాయి? ఆ ప్రేమను పొందిన వినయే అదృష్టవంతురాలు. భర్త నుంచి ప్రేమనే కానీ ధనాన్ని కోరుకోని భార్య దొరకడం మగవాడి అదృష్టం కూడా.

******